# 17

# ప్రయాణం

## పౌరహక్కుల సంఘం నిజ నిర్ధారణ కమిటీ
## (కథా కాలం 1983)

"ఏం జీపు తెచ్చినవయ్యా!.. హా.. రామచంద్రా! ఊ.."

ఐదుగురు కలిసి నెట్టినా అది బురద మట్టిలో నుండి కదలనంటున్నది. అటూ ఇటూ నెట్టిన కొద్దీ దానికి ఉయ్యాల ఊపినట్టుగా హాయిగా నిద్రొస్తున్నట్టుంది. బురదలోకి మరింత లోతుగా కాళ్ళు చాపుకుని నిర్రందిగా ఒరుగుతోంది.

"ఇరవై రూపాయలు తక్కో యిస్తమయ్యా! అన్నందుకు.. యిగ నా చేతికి దొరుకరా.. అన్నట్లు చేస్తున్నవయ్యా!.."

"ఊం.. ఊం .... ఉహ్ం ఆ లోడ్ గేర్ వెయ్యవయ్యా బాబూ.. మాకు తగ్గట్టు మంచిగా దొరికినవు గద!.."

"గేరేసి ఏం జెయ్యాలె సార్....! ముందు స్టార్ట్ కావద్దా....?"

"హా సెల్ఫుగూడ పని చేస్తలేదా..? ఇగ ఎట్లనయ్యా ..... నువ్వుగూడ దిగు...."

డ్రైవరు కూడా దిగాడు. నెట్టే ప్రయత్నం యిక మాని బురద మట్టి లోంచి టైర్లని పైకెత్తే ప్రయత్నం చేస్తున్నారు. అయినా బంకలా అంటుకుపోయిన మట్టిలోంచి లేచినట్టే లేస్తూ మరింత కూరుకుపోతున్నది.

"ఓ తాతగారూ! ఆ టైర్ లేస్తలేదంటే దానికింద రాళ్ళు నూకుతానని కూసుండి పని తప్పించుకుందామనుకుంటున్నావా! లే నువ్వుగూడా చెయ్యివెయ్యి."

"ఊం .... నేను అరవై యేండ్ల ముసలోన్ని చెయ్యి వేసేదాకా కదలనంటున్నదా జీపు.... చూడబోతే అంతా యువకులే.... మీ వయసులో నేనున్నపుడు.... ఒక్కణ్ణి అమాంతం జీపుని లావట్టుదుంటీ.... ఊం .... ఉహ్...."

"ఆ కాలంలో నీకు ఏం పని పడ్డది తాతా! - ఊఁ .... ఎత్తూ ...."

"ఊ .... జీపంటే జీపా-? ఈ జీపుకన్నా బరువున్న వడ్లబండి కూలబడితే గారె యిట్లవట్టి... ఊఁ... ఊఁ..."

ఎట్టకేలకు జీపు టైర్లు మట్టిలోంచి లేచాయి. అక్కడితో పని అయిపోలేదని డ్రైవింగ్ స్టీరింగ్ పట్టుకు కూర్చుని "సార్....కొంచెం...." అర్థోక్తిగా చెప్పాడు.

"ఇక తప్పుతుందా... ఊఁ..."

పదిగజాలు నెట్టగానే జీపు స్టార్టయింది. కర్చీఫ్‌తో ముఖాలు తుడుచుకుని అందరు మళ్ళీ జీపు ఎక్కారు. తాతగారు డ్రైవరు పక్కన కూర్చున్నాడు. ఇందాక నెట్టడానికి నాయకత్వం వహించిన పల్లె రాజేశం తాత పక్కనే కూర్చున్నాడు.

"తాతా! ఈ వచ్చే పల్లెకాడ చాయె తాగుదామా!" బ్యాక్ సీట్లో కూర్చున్న వేణు తాత కేసి చూస్తూ అడిగాడు.

జాప లక్ష్మారెడ్డి తాత ఏమంటాడోనని అందరూ ఆశగా చూస్తున్నారు.

అందరికీ ఆకలిగా వుంది. పొద్దున చేసిన టిఫిన్ మొదటిసారి జీపు నెట్టినప్పటికే కరిగిపోయింది. ఈ రెండోసారి నెట్టినపుడు నిజంగానే కండల్ని కరగదీయాల్సి వచ్చింది. అలసటగా ఉంది. కనీసం చాయె.... చాయె.... తాగనియ్యి తాతా అన్నట్లు వారి చూపులు.

జాప లక్ష్మారెడ్డి వారి గోడు పట్టించుకున్నట్లు లేదు -

"ఊఁ" అంటూ చూశాడు.

పల్లె రాజేశం "నీయిష్టం" అన్నట్లు నవ్వాడు.

"ఇంకో పది కిలోమీటర్లు పోతె అయిపాయె.... అక్కడ అందరూ జమ అయ్యే లోపల తాగవచ్చులే.... నడుమ ఈ పల్లెల ఆగితిమా! ముందే ముహూర్తాలు మంచిగ లేవు...! పద.... పద! డ్రైవరుగారూ సక్కగా తీస్కపో.... మల్ల ఎక్కడ ఆపకు... సెల్ఫు లేదని ముమ్ముల తిప్పల పెట్టకు..."

జాప లక్ష్మారెడ్డి తాత మాటతో యిక చాయె మాటకు నీళ్ళు వదులుకున్నారు. ఆ పల్లెకి చేరాక... అందరూ చుట్టుమూగుతారు.... చాయె సంగతి దేవుడెరుగు.... ముందు దుర్ముహూర్తం రాకముందే వచ్చిన పనికానిద్దాం... అంటాడు.

వాళ్ళకు జాప లక్ష్మారెడ్డి తాతంటే భయంకాదు. తాత మీద గౌరవం! వెళ్తున్న పని తొందరగా సకాలంలో పూర్తిచేసుకోవడం ముఖ్యం. అని మౌనంగా వుండి పోయినట్టున్నారు.

బురద చిమ్ముకుంటూ జీపు వేగంగా పోతోంది. రోడ్డుమీద పెరిగి తలారా స్నానం చేసి పచ్చగా మెరుస్తున్న గడ్డి బురద చిల్లి ముఖం చిట్లిస్తోంది.

చాయె తాగుదామన్న పల్లెలోకి చేరి బండి స్లోఅయింది. రోడ్డు వెంట సైకిళ్ళ మీద ఇద్దరు కానిస్టేబుల్లు ఎదురయ్యారు. జీపుకేసి జీపులోని వాళ్ళకేసి తొంగిచూశారు.

"పాడు శకునం ఎదురైంది..." తాత గొణుక్కున్నాడు.

"ఏంగాదు తాతా! నువ్వున్నంక అన్ని శకునాలు మంచిగయితయిలే..." వెనుక కూర్చున్న మల్లిఖార్జున్ ధైర్యం పలికాడు.

ఆ పల్లె దాటగానే మళ్ళీ ముసురందుకుంది. జీపులో కూర్చున్నవాళ్ళందరికీ ఏదో ఒక పార్శ్వం తడుస్తోంది. ఏం చేయడానికీ లేదు. దాని టార్పాలిన్ టాప్ తిరగబడి పాతబడి చిరిగిపోయింది. ఫ్రంట్ బ్యాక్ పూర్తిగా వూడిపోయాయి.

"ఇదీ మన ప్రాణానికే తగిలింది... పొద్దున్నుంచి కారుతనే వున్నది. మా మనుమడు ముక్కు చీదినట్టు... వాన ఒక్కసారే పడది... ఆగది..." జాప లక్ష్మారెడ్డి తాత విసుక్కుని వెనక కూర్చున్నవాళ్ళని చూస్తూ మళ్ళీ అన్నాడు.

"వార్తలు పెట్టవయ్యా వకీలు సాబూ!"

వార్తలు అయిపోయినట్టున్నాయి. రైతులకు వాతావరణ సూచన... ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు పడవచ్చు. కరీంనగర్ జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుంది ..." అంటూ ఇంకా ఏదో వినిపిస్తోంది పాకెట్‌సైజు ట్రాన్సిస్టరు.

"ఛట్... బందు జెయ్యి... రైతులు ఈ రేడియోవినే వ్యవసాయం చేయాలె యింగ..." కరీంనగర్‌ల ముసురు పడ్తుంటే వాతావరణం పొడిగా వుందటనా?! తాతగారు కోపంగా అనడంతో రేడియో ఆగిపోయింది.

వర్షంకూడా పెరుగుతోంది. గాలికూడా తోడై చినుకులు జీపులోపలిదాకా

విసిరి కొడుతున్నాయి. అద్దంలోంచి ఎదురుగా ఏముందో కనిపించడంలేదు. అద్దం తుడిచే వైపర్ బ్యాటరీ అయిపోయి ఆగిపోయింది. ఓ కుదుపుతో బండి ఆగిపోయింది.

"ఈ వర్షంలో ఇక్కడ బండి ఆగితే ఎట్లనయ్యా బాబూ..." పల్లె రాజేశం.

డ్రైవరు ఏదో చేసినట్టున్నాడు. బండిలోడ్ గేరుతో మళ్ళీ ముందుకు పొట్టేలులా కుమ్మి సర్దుకుని మెల్లగా పోతోంది. బండి స్పీడు తగ్గినట్టుగా వర్షం స్పీడుకూడా తగ్గినట్టనిపిస్తోంది. ఆ పల్లె చేరేప్పటికి దుబ్బురు దుబ్బురుగా తుంపర తుంపరగా చినుకులు పడుతున్నాయి.

"లెఫ్ట్‌కు" టర్న్ సూచించాడు పల్లె రాజేశం. అలా కొద్దిదూరం పోయింది.

"రైటుకు"... అన్నాడు పల్లె రాజేశం. కొంతదూరం వెళ్లి జీపు ఆగిపోయింది.

అక్కడి నుంచి జీపు ఆ బాటలో సాగేట్టులేదు. సాగినా బయటకు వెళ్ళటం కష్టం. ఎత్తు వంపులుగా బండి గారెతో వర్షపు నీటితో కోసుకుపోయింది. అదే రోడ్డూ, అదే వర్షపు నీటి కాలువగా వుంది.

"ఇంక ముందుకు పోదంటవ...? మనం చేరాల్సింది ఈ పల్లెగాదు... వాగు అవతలది..." డ్రైవర్ని అడిగాడు పల్లె రాజేశం.

"నాదేం లేదు నడిపించుమంటే నడిపిస్త."

"మళ్ళీ నెట్టాల్సింది మీరే కదా" అన్నట్టుంది జవాబు.

"సరే మేం నడుస్తాం... నువ్విక్కడ్నే వుండు... చాయె దొరుకుతె తాగు..." అంటూ రెండు రూపాయల నోటు ఇచ్చాడు పల్లె రాజేశం.

జాప లక్ష్మారెడ్డి తాత, పల్లె రాజేశం తాడిగిరి పోతరాజు, బి.ఎస్. రాములు, వేణు, పాపారావు, మల్లిఖార్జున్ ఉస్సురంటూ జీపులోంచి దిగారు.

వర్షం తుంపర తుంపరగా ఇంకా కురుస్తూనే వుంది. తాత తువ్వాల తల మీద వేసుకున్నాడు. కొందరు తలలకు కర్చీఫ్‌లు చుట్టుకున్నారు.

'ఒక నిమిషం' అంటూ పల్లె రాజేశం కొంచెం వెనక్కి వెళ్ళి అటూ ఇటూ చూశాడు. ఎవరికోసమో చూస్తున్నట్టున్నాడు. "ఈ వర్షంలో ఎవరూ రానట్టున్నరు పద.." అంటూ ముందుకు కదిలాడు పల్లె రాజేశం. అందరూ వెంట నడిచారు.

"కాగితాలు భద్రం వకీలుసాబూ" అంటూ హెచ్చరించాడు తాత.

మల్లిఖార్జున్ అంతకు క్రితం రికార్డుచేసి తెచ్చుకున్న కాగితాల్ని బొడ్లో దోపుకున్నాడు.

❄ ❄ ❄

చెప్పులు టప్పర టప్పర శబ్దం చేస్తున్నాయి. వెనక వస్తున్న వాళ్ళకి అవి పన్నీరు చల్లుతున్నాయి. తుంపర చినుకులు తగ్గుముఖం పడుతున్నాయి.

ఆ వాగు చేరేసరికి వర్షం పూర్తిగా తగ్గిపోయింది. వెడల్పు తక్కువ ఆ వాగు వరదతో నిండుగా ప్రవహిస్తోంది. రెండు బర్రెలు, ఓ గొడ్డు అది తమ కలవాటే నన్నట్టుగా అందులో ఈదుకుంటూ అవతలికి చేరాయి. వాగు ప్రవాహ శబ్దంతోపాటు ఏదో గరరర.. ర.. శబ్దం వినిపిస్తోంది. చెవులు రిక్కించాడు పల్లె రాజేశం. జీపు రిటర్న్ తీసుకుని డ్రైవరు ఇంజన్ రేజ్ చేసినట్టున్నాడు.

కొద్దిసేపట్లోనే వరద తగ్గి నిదానంగా ప్రవహిస్తోంది వాగు. అవతల ఒడ్డున అంతదాకా నిలబడ్డ యువకుడు వాగు దాటుతున్నాడు. నీళ్ళు నడుందాకా వచ్చాయి. వాళ్ళని అప్పట్నించీ అవతలి ఒడ్డునించి చూస్తున్నట్టున్నాడు. వారికేసి సాభిప్రాయంగా చూశాడు. వారిని దాటి ముందుకు నడిచాడు.

"ఇంక గంట నిలవడ్డా యిది తగ్గది. రేపు పొద్దుటికి యింక లోతుంటుంది. సుట్టు గుట్టల్లకెల్లి నీల్లచ్చి వాగుల్ల కలుస్తుంటై..." అడుగుదామని పల్లె రాజేశం అతనివేపు చూశాడు. ఆ యువకుడు ఇటు చూడకుండనే గబగబ వెళ్ళిపోతున్నాడు. వారిని చూస్తూ అడిగాడు తాత.

"మీ సిన్నప్పుడు గట్ల వాగు నీల్లల్ల .... వర్షపు నీల్లల్ల ఈత కొట్టిన్రో లేదో.... ఇప్పుడు వాళ్ళ పుణ్యాన మీకు ఈ అవకాశం దొరికింది..."

అందరూ నవ్వుకున్నారు. తెలియని వాగు అక్కడక్కడ మరీలోతుగా ఉన్నట్టుంది. అటు దొర్లి ఇటు దొర్లి ఎలాగోలా అవతలి ఒడ్డుకు జేరుకున్నారు. వేణుశ్రీ జారి నీళ్ళల్లో పడిపోవడం వల్ల డ్రెస్సు తడిసిపోయింది. గట్టిగా పిండి తొడుక్కున్నాడు. పచ్చి డ్రాయర్ల మీదే ప్యాంట్లు వేసుకోవడం వల్ల మిగిలిన వాళ్ళవి కూడా మెల్లమెల్లగా తడుస్తున్నాయి. బక్కపలచని వేణుశ్రీ చలికి వణుకు తున్నాడు.

ఆ పల్లెని పరకాయించి చూశారు అందరూ. అది ఒడ్డుని ఆనుకొనే వుంది.

వూళ్ళోకి వంకర టింకరగా బురద నిండిన బాట కనిపిస్తోంది. ఆ ఇండ్ల వెనక పెరండ్లు కనిపిస్తున్నాయి. జారుతున్న చెప్పులతో మెల్లెమెల్లెగా అడుగులు వేశారు వాళ్ళు. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. రోడ్డంతా బురద.... రోడ్డునిండా పేడతో అలుకు చల్లిన వాకిళ్ళు సర్రున జారుతున్నాయి.

ఇళ్ళ ముందు సన్నని కాలువగా వర్షం నీరు ప్రవహిస్తోంది. వాన పడవలు ఆడుకునే పిల్లలు కనిపిస్తారేమో నన్నట్టు తాడిగిరి పోతరాజు అటూ ఇటూ చూశాడు. ఎవరూ లేరు. కనీసం కోళ్ళు, పశువుల అలికిడి కూడ లేదు. వాగవతల రోడ్డు మీది జీవు కనిపిస్తోంది. ఎవరో ముసలమ్మతో ముచ్చట చెబుతున్నట్టున్నాడు డ్రైవరు.

ఎవరో ఎడ్లను తోలుకుంటూ ఎదురయ్యారు. రైతు యువకుడిలా ఉన్నాడు. దగ్గరదాకా వచ్చాక అడిగాడు పల్లె రాజేశం.

"మీది ఈ ఊరేనా?"

"ఎందుకు?"

ఆ ప్రశ్నతో తన కంఠం సవరించుకున్నాడు పల్లె రాజేశం.

"చంద్రయ్య ఇల్లు కావాలి."

ఆ మాటతో వాళ్ళకేసి ఎగాదిగా చూశాడు. అతను నొసలు ముడిచాడు. ఏమనుకున్నాడో ఏమో. "నాకు తెలువది..." అని "హెయి" అంటూ ఎడ్లని అదిలిస్తూ సరసర వెళ్ళిపోయాడా వ్యక్తి. ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"మ్ మ్..." అని గంభీరంగా తల ఊపాడు జాప లక్ష్మారెడ్డి తాత.

మళ్ళీ కొంత ముందుకు నడిచారు. ఇళ్ళ తలుపులన్నీ మూసివున్నాయి. రోడ్డు మీద ఒక్క పురుగులేదు.

"ఏంచేద్దాం ఇలా ఎంత దూరం నడుద్దాం? తలుపొకటి కొట్టి ఎవర్నైనా పిలిచి అడుగుదాం..." అంటూ ఆగిపోయాడు మల్లిఖార్జున్. మల్లిఖార్జున్‌తో అందరూ ఆగిపోయారు. ముందట నడుస్తున్న పల్లె రాజేశంకు ఏదో ఇల్లు తలుపులు సగం తీసి కన్పించింది.

"ఇటు రండి" అని చెయ్యి ఊపాడు.

అది కారప్పూసల బుట్టి దుకాణంలా వుంది. అదే ఇల్లు అదే దుకాణంలా వుంది. దుకాణంలో ఎవరూ లేరు.

"సేటూ!" పిలిచాడు పల్లె రాజేశం.

మెల్లగా బయటకు తొంగి చూశాడు సేటు. ఆశ్చర్యపోతూ అందరివైపు ఎగాదిగా చూశాడు.

అందరూ పూర్తిగా తడిసిపోయారు. తలల్లోంచి నీళ్ళు కారుతున్నాయి. వేణు ప్యాంటు చెప్పులను తడుపుతున్నట్టుంది. చలితో దవడలు బిగపట్టినట్లున్నాడు. అందరూ తన వైపే చూస్తున్నారని గమనించగానే సేటుకు ఎందుకో వెన్నుపూస వణికినట్టయింది.

అదేదీ గమనించినట్టు లేదు పల్లె రాజేశం.

"బర్కిలీ సిగరెట్లుంటే ఒక డబ్బా ఇవ్వు సేటూ" అంటూ ఐదు రూపాయలతో చేయి చాపాడు.

"లేవు సార్...."

"చార్మినార్ సిగరెట్లున్నాయా మరి" అంటూ తాత అడిగాడు.

"లేవు"

"హుఁ... ఏమున్నయి మరి" మర్యాదగానే అడిగినా ఎందుకో బెదిరిపోయి నట్టున్నాడు సేటు.

"అయ్యా! దండం బెత్త... డైమన్ బీడీలు, అగ్గిపెట్టెలు... యింత కారప్పూస బెల్లం ఉండలు... ఏదో యిన్ని అటుకులు... బోల్ప్యాలాలు... ఏదో బాంచెను... బుట్టి దుకాణం... యీ పల్లెల... ఇంతకంటే ఎక్కో ఏంగొంటరు సారు..?" రెండు చేతులు జోడించాడు సేటు.

"ఉప్పు చింతపండు బెల్లం శక్కర చాపత్తలేవా...?"

"అయ్యా... ఉన్నయి."

"ఓ రెంట్రూపాల బోల్ప్యాలాలు, రూపాయి బెల్లం బెట్టు." తాత మాటతో వాళ్ళకి మళ్ళీ ఆకలి గుర్తొచ్చినట్టుంది.

"అవి మీరెక్కడ బుక్కుతరు సారు? మూన్నెల్లకింద తెచ్చినై. ముక్కిపోయినై ఏదో పిల్లగాన్లు అయిదు పది పైసలకు కొనుక్కుంటరు." సేటు కంఠం వాళ్ళు ఏమంటారోనని వణుకుతోంది. భయంతో ముఖం ముడుచుకు పోయింది.

వేణుశ్రీ, మల్లిఖార్జున్ ఇటు చూస్తున్నట్టు లేరు. రోడ్డుమీద ఎవరైనా కనిపిస్తారేమోనని చూస్తున్నారు. ఎవరో పిల్లవాడు చేతిలో పదిపైసల బిళ్ళతో దుకాణంకేసి పరిగెత్తుకొస్తున్నాడు. వాళ్ళని చూసి ఆగిపోయాడు.

"రా బాబూ" ఆప్యాయంగా చెయ్యి ఊపాడు మల్లిఖార్జున్... భయంతో వెనక్కి తిరిగి పరిగెత్తాడు పిల్లవాడు. మళ్ళీ పిలవడంతో మరీ కలవరపడ్డట్టున్నాడు. ఏదో తట్టుకునో జారిపడో.... బోర్లా పడిపోయాడు."అరెరెరె" అంటూ పరుగున వెళ్ళి పిల్లవాణ్ణి లేవనెత్తాడు మల్లిఖార్జున్. పిల్లవాడు కంగారుగా చూస్తున్నాడు. చేతిలోంచి జారిపడిపోయిన పదిపైసల బిళ్ళని వెతికి ఇచ్చారు.

"ఏం కొనుక్కుంటవ్? దా" అంటూ ఆప్యాయంగా చేయి పట్టుకుని దుకాణం వేపు నడిపించాడు. పిల్లవాడివేపు ఆందోళనగా తలుపు చాటు నుండి రెండు కళ్ళు చూస్తున్నాయి.

"దెబ్బ తాకిందా? అమ్మ యిచ్చిందా" అంటూ గోముగా తాడిగిరి పోతరాజు అడగడం విని ఆ తల్లి ఆశ్చర్యంగా అలాగే చూస్తూ ఉండిపోయింది.

అప్పటికి కొన్ని కారప్పూసలు తీసుకున్నట్టున్నారు. కారప్పూసలు, పేలాలు, బెల్లం... ఎవరికి నచ్చింది వారు తింటున్నారు. బురద నిండిన పిల్లవాన్ని ఆప్యాయంగా బుగ్గలు నిమిరాడు తాత. గట్టిగా పట్టుకున్న పిడికిలిని చూశాడు.

"అరే అక్కడ నా పదిపైసలుగూడ పోయిండె... ఆఁ ఇవి నాయే గదా..."

నిజంగానే లాక్కుంటాడోనని పిడికిలి మరింత గట్టిగా మూసాడు పిల్లవాడు.

"ఏదీ చెయ్యి చాపు – పోనీ నోరు పట్టు ఆఁ..." అంటూ తాత వాడి నోటి నిండా పేలాలు నింపాడు. ఆ ఆప్యాయతా, మాట తీరూ చూస్తున్న సేటు మనస్సు కొంచెం కుదుట పడుతున్నట్టుంది.

"ఓ గణేష్ బీడి కట్ట – అగ్గిపెట్టె తడిసిపోయింది. అట్లానే ఓ అగ్గిపెట్టియ్యి."

అవి ఇచ్చి మరోసారి వాళ్ళకేసి చూశాడు సేటు. ఎవరి కిష్టమైనది వాళ్ళు

బెట్టులేకుండా ఫ్రీగా తినేస్తున్నారు. ఆ పిల్లవాడికి బెరికిపోయినట్టుంది. గబగబా వాళ్ళతోపాటు తినేస్తున్నాడు.

"ఏదో యింత కడువుల వడ్డది.... ఇగ చాలు" అంటూ మూతి తుడుచుకున్నాడు పల్ల్ రాజశం.

ఒకరి తర్వాత ఒకరు చాలన్నట్టుగా మూతి తుడుచుకుంటూ చేయి దులుపు కుంటున్నారు.

"చాయె అమ్ముతవ సేటు........"

అది కాస్త కడుపులో పడితే చలి తగ్గుతుందన్నట్టుగా అడిగాడు వేణు.

"లేదు సారు"

"పొద్దుట్నించి వర్షంల తడుస్తనే వున్నం. ఇంట్ల పాలుంటే కొంచెం చూడరాదూ! పాలు లేకపోతే ఇంత డికాషన్ (బ్లాక్‌టీ) అయినా సరే .... పైసలు చాయెకు తీసుకున్నట్టే తీసుకో...."

"జానే! సార్లచ్చిన్రు........ ఏడు చాయెలు పెట్టు........కొంచెం చాపత్త మంచిగెయ్యి......"

❄ ❄ ❄

వాతావరణం పచ్చి పచ్చిగా వుంది. ఆకాశం నిండా మళ్ళీ మబ్బులు కమ్ముకుంటున్నాయి. పొద్దు ఎక్కడుందో కన్పించడం లేదు – అంతా చలిచలిగా వుంది ...... పిచ్చాపాటీ మాట్లాడుతున్నారు వాళ్ళు. జీపు ప్రయాణం మాటల్లో దొర్లడంతో సేటు కొంత ఆసక్తిగా చూశాడు.

"పెళ్ళికి పోతున్రా సారు ..... ఏ వూర్లె?"

"మీ ఊరికే వచ్చినం ...."

"తనకు తెలియని పెళ్ళి ఎవరిదా!" అని ఆలోచిస్తున్నాడు. 'ముందే పెద్దసార్లు ఎక్కువ మాట్లాడై ఏమంటరో .....' అనుకొని మౌనంగా వుండిపోయాడు సేటు.

పిల్లవాడు తినగా మిగిలినవి పొట్లం కట్టివ్వడంతో సంతోషంగా ఇంటికేసి పరిగెత్తాడు.

టీ రావడంతో అందరికి ప్రాణాలు లేచివచ్చినట్లయ్యాయి. పాలు సరిపోనట్టున్నాయి పలచగా వుంది. అయినా అదే అమృతంలా కొద్దికొద్దిగా చప్పరిస్తున్నారు. పల్లె రాజేశం కళ్ళతోనే జాప లక్ష్మారెడ్డి తాతకు సైగ చేశాడు. అది అర్థం చేసుకున్నాడు తాత.

"జె సేటూ ! గీ చంద్రయ్య ఇల్లెక్కడ?"

ఆ మాటతో సేటు మొహం మళ్ళీ బిగుసుకుపోయింది. భయంతో కళ్ళు నోరు అలాగే తెరచుకుని వుండిపోయాయి. నాలుకపై తడి ఆరిపోయింది. గుండె వేగంగా కొట్టుకుంటోంది...

"ఏం సేటు! అప్పట్నించి చూస్తున్న... అట్ల భయపడతవేంది?"

"ఏమో సారూ ... అదేం రోగమో ఏమో... ఈ నడుమ కొత్తోళ్ళను ఎవలను జూసినా నా పానమంత ఎట్లనో అయితంది. కాళ్ళు చేతులు వణుకుతున్నై."

"సరే మేం పాతవడుతం తియి... ఇగో ఈ సారు పేరు మల్లిఖార్జున్ - వకీలు. నా పేరు జాప లక్ష్మారెడ్డి - వ్యవసాయం చేసుకుంట... ఈ సారు పల్లె రాజేశం - లెక్చరర్ - కరీంనగర్ జిల్లా పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు. ఈ సారు పేరు పాపారావు - వకీలు. ఈ సారు తాడిగిరి పోతరాజు - గవర్నమెంటు కాలేజిలో లెక్చరరు, మంచి రచయిత... ఈ సారు బి.ఎస్. రాములు - జగిత్యాల పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి, ఈ సారు పేరు వేణుశ్రీ - ప్రయివేటు కాలేజీలో లెక్చరరు, కవిత్వం రాస్తడు... ఈ సారు పేరు ఆంజనేయులు - జనతాపార్టీ లీడరు..." అంటూ అందర్నీ పరిచయం చేశాడు.

"మీ పేరేమంటిరి" ఏదో జ్ఞాపకం చేసుకుంటూ అడిగాడు సేటు పల్లె రాజేశంను.

"పల్లె రాజేశం"

ఆశ్చర్యపోయాడు సేటు. మళ్ళీ ఏదో ఆలోచిస్తున్నట్టుగా అన్నాడు.

"చంద్రయ్య మీ దగ్గరికే వచ్చెగద సారు !"

"అవును... చంద్రయ్య కలిసి చెప్తెనే ఈ ఆదివారం వస్తున్నం - అని చెప్పినం... మా కోసం రోడ్కాడ ఎవరైనా వుంటారు అనిగూడ చెప్పిండు..."

"అంటే ?" ప్రశ్నార్థకంగా ఆగిపోయాడు సేటు. ఏదో గుర్తుకు తెచ్చుకుంటూ మళ్ళీ అన్నాడు.

"చంద్రయ్య మీ దగ్గరికనే బయలెల్లి మల్ల పల్లెల కనపడలేదు. అంటే మిమ్ముల గలిసినంక నడుమనే వాళ్ళు మాయం జేసినట్టున్నరు..."

"అరే...!" అని బాధపడ్డాడు పల్లె రాజేశం.

"అంటే మేం వస్తున్నట్టు మీకు ఎవలకు తెల్వదన్నమాట?"

"అయితే ఇప్పుడేమిటి చేయడం? ఇంత దూరం వచ్చి వాపసు వెళ్ళడమా ! మళ్ళా ఎప్పుడు వీలవుతుందో... ఏమిటి చేయడం..." మళ్ళీ ఆలోచిస్తూ ఏదో గుర్తుకొచ్చి అడిగాడు పల్లె రాజేశం.

"ఔ సేటు ! మల్లవ్వ, రాజేశ్వరి వాళ్ళ ఇల్లెక్కడ ?"

"వాళ్ళుగూడ లేరు సారు !"

"అంటే ?" ప్రశ్నార్థకంగా చూశాడు తాత.

"వాళ్ళు నిన్న గూడ తిరిగి చెప్పిపోయిన్రు. ఎందుకో అనుకున్న ! అయితే వీళ్ళు అప్పట్నుంచే ఊల్లె లేరు సారు ...."

'ఏమిటి చేయడం ? ఊరంతా భయానక వాతావరణంలో కూరుకుపోయి వుంది. ఈ సేటుకు కొంచెం తెలిసినట్టే ఉంది. కాని చెప్పేట్టు లేదు ...... కనీసం తమ వెంటయినా వచ్చి సాయం చేస్తడా.... తాత'.

"ప్చ్ ! సరే సేటు ! వాళ్ళ అత్త మామలో, తల్లిదండ్రులో, అన్నదమ్ములో ఎవరన్న వున్నరా?"

ఆ దర్వాజాలోంచి కొంచెం బయటికి వచ్చాడు వేణుశ్రీ.

"అగో గటు. ఎడం పక్కకు తిరిగి ముందుకు పోవాలె... అక్కడ వాకిలితీరు వుంటది. ఆ వాకిలి ఇంటి గోడపొంట గజమంత సందు వుంటది... ఆల్ల యిద్దరి యిండ్లు ఆ సందిల్నె వున్నయి. ఎదురుంగనే వుంటయి. ఎవరినడిగినా చెప్తరు సారు."

"ఎవల నడిగినా చెప్తరా...?" అర్థోక్తిగా నవ్వుతూ అన్నాడు పల్లె రాజేశం.

"మరి ఎట్ల సారు ? ఇదివరకే అందరు ఈపులు పలిగివున్నరు. మనోడో మందోడో తెలువంది చెప్పుడెట్ల? వయసు వయసు పోరగాన్లను ఊర్లె ఉండ రాకుండ జేసిన్రు. నా దగ్గర నూర్రూపాయల సామాను ఎత్తుకపోయిన్రు.."

మల్లిఖార్జున్, తాడిగిరి పోతరాజు అదంతా కాగితాల మీద వెంట వెంట రాస్తూనే వున్నారు. ఇంత కష్టపడి వచ్చినందుకు కొంతైనా సమాచారం దొరుకు తున్నందుకు మిగిలిన వాళ్ళందరి మొహాలు వికసించాయి. ఆసక్తిగా వింటున్నారు. అది గమనించి ఇంట్లో వున్న సేటు భార్య తలుపు పక్కన వచ్చి నిలబడింది. వాళ్ళవేపు ఆసక్తిగా చూస్తోంది. అంతంత గొప్ప వాళ్ళలో కూడా తమ గురించి పట్టించుకునేవాళ్ళున్నారా అని అబ్బుర పడిపోతున్నట్టుంది. అవీ యివీ చెప్పాక వాళ్ళు రాస్తున్నది గమనించినట్టున్నాడు సేటు.

"మీ దయ సారు. నా పేరు రాయకున్రి. మల్ల గొడుతరు సారు. మా గురించి ఏం రాయకున్రి సారు." బతిమాలాడు సేటు.

"రాసుకోనీ తియ్యరాదు" అని సేటు భార్య మరికొంత ముందుకు జరిగింది. అభినందన సూచకంగా ఆమె వేపు చూశారు. ఏమైనా తెలిసింది చెప్పుమన్నట్టు చూశారు. అంతమంది ఎదుట చెప్పడానికి సంకోచంగా గొంతు పెగలనట్టుంది.

"ఏం జరిగిందో చెప్పమ్మా !" ప్రోత్సహించాడు పల్లె రాజేశం.

తనలో తాను సరాయించుకొని అంది సేటు భార్య.

"ఈ ఇల్లంత చూసిన్రు. దేవుని అర్రల్లగూడ చూసిన్రు సారు. గల్ల గురిగల యాభై రూపాయలుండె. ఎత్తుకపోయిన్రు.. తుపాకులు పట్టుకోని.. నన్ను..." ఆగిపోయింది. రాస్తున్న తాడిగిరి పోతరాజు తలెత్తి చూశాడు. ఆమె ఏదో చెప్పడానికి సందేహం ఫీలవుతున్నట్టున్నది. సేటు చెప్పలేక తల వంచుకున్నాడు.

"ఆ... ఇంకా" ప్రోత్సహించాడు తాత. సేటు భార్యకి కొనకంటితో ఏదోసైగ చేసినట్టున్నాడు. మౌనంగా ఉండిపోయింది. మళ్ళా అడిగాడు పల్లె రాజేశం.

"పట్టపగలు అందరు జూడంగనే గిట్ల ఎత్తుకపోయిన్రు. దొంగలు సారు"

ఆమె తొలుత చెప్తామనుకున్న మాటలు మరిచిపోయినట్టుగా అందరికి తెలుస్తూనే ఉంది. ఆమె భయం భయంగా గోడలు చూస్తోంది.

"ఆ మల్లవ్వ, రాజేశ్వరి గురించి ఏం జరిగిందో, ఎట్ల జరిగిందో మీరు చూసింది, విన్నది చెప్పగలరా ?" ఆ మాట వినడంతోటే ఆమె ఎందుకో వణికిపోయింది. కొంచెం లోపలికి జరిగింది.

"ఇక చెప్పలేకపోవచ్చు." అన్నాడు తాత.

"మరీ అంత బలవంతం చేయడం బాగుండదు." పల్లె రాజేశం.

తమలో తాము ఇంగ్లీషులో చర్చించుకున్నారు వాళ్ళు. ఏంటో అర్థం కాక చూస్తుండిపోయాడు సేటు. 'కొంత సమయం ఎక్కువ తీసుకున్నా ఎంతో కొంత విషయం చెప్పారు. టైం వేస్టు కాలేదు' అనుకున్నారు.

"మంచిది సేటూ! మొత్తం ఎంతయింది" అంటూ బిల్లు ఇచ్చేశాడు పల్లె రాజేశం.

"వెల్తం సేటూ.... గట్ల భయపడకు(ని.... ధైర్యంగా ఉండు(ని....." అంటూ ముందుకు కదిలింది పౌరహక్కుల బృందం.

ఆ వాకిలి అంతా బురదగా వుంది, కాలు పెట్టగానే జారిపోతుంది. ఆ వాకిలి పక్కనున్న మరో ఇంటి ముందు ఎవరో ముసలి రైతు కూర్చుని వున్నాడు.

ఏదో అడుగుదామని నోరు తెరిచాడు తాత. వెంటనే అతను ఇంట్లోకి వెళ్ళిపోయాడు. బహుశా అతని భార్యేమో... వచ్చి తలుపు మూసి లోపల గడియ పెట్టేసింది.

ఆశ్చర్యంగా అటూ యిటూ అడుగువేసేసరికి బారీ శరీరం గల తాడిగిరి పోతరాజు జారిపడబోయి పందిరి గుంజ పట్టుకున్నాడు. అది అడుగున బాగా చీకిపోయిందో ఏమో... బరువుకు భూ మట్టానికి పటుక్కున విరిగిపోయింది.

ఏం చేయడానికీ తోచక దాన్ని అలాగే అతిప్రయత్నం మీద నిలబెట్టాడు తాడిగిరి పోతరాజు. 'ఎంత తిట్టుకుంటారో' అనుకుంటూ వారి వెనక పందిరిలోకి నడిచాడు.

అంత చిన్న సందులో ఏడెనిమిదిళ్ళు ఉండడంతో ఆశ్చర్యపోయాడు పల్లె రాజేశం. అటూ ఇటూ చూశాడు. అవి వాగుకు దగ్గరే వున్నట్టున్నాయి. వాగు ప్రవాహం కనిపిస్తోంది. "అంటే తాము వూరంతా చుట్టూతా తిరిగి వచ్చారన్న మాట"

ఇద్దరు పిల్లలు మట్టితో గోలీలు చేస్తున్న వాళ్ళల్లా అవి అలా వదిలేసి ఇళ్ళలోకి పరిగెత్తారు. కిర్రుమన్న శబ్దమైనా లేకుండా అన్ని ఇళ్ళ తలుపులు గడియలు వేసుకున్నారు. ఎవర్ని పిలవడమా అని నిలబడి అటూ ఇటూ చూస్తున్నారు.

అది గుట్ట అంచున వున్నట్టుంది. గుట్టకీ, ఇళ్ళకీ మధ్య ఓ కిలోమీటరు ఎడం మాత్రమే ఉన్నట్టుంది. ఆ గుట్టకావల కొండల వరుస వున్నట్టుంది. ఆ పెరండ్లు దున్నినట్టున్నారు. జొన్న, మొక్క జొన్న మొలకలు లేస్తున్నాయి.

ఏవో లెక్కలు పెట్టుకుని తలుపు కొట్టాడు పల్లె రాజేశం. నాలుగైదుసార్లు గట్టిగా పిలిస్తేగానీ తలుపు తెరుచుకోలేదు. యాభై ఏళ్ళ పెద్దమనిషి మెల్లిగా తలుపు తీశాడు.

"మల్లవ్వ ఇల్లు ఇదేనా..." అడిగాడు జాప లక్ష్మారెడ్డి తాత.

ఏందో అంటున్నాడతను. మాట స్పష్టంగా వినపడడం లేదు. గట్టిగా రెట్టించాడు తాత... మళ్ళీ అదే తీరు... అప్పుడు గమనించారు వాళ్ళు.

అతడి పళ్ళు ఏవో విరిగిపోయినట్టున్నాయి. దవడలు వాచిపోయాయి. నడుం మీద వాతల్లా ఏవో మచ్చల అచ్చులున్నాయి. తలుపు చాటునేవున్న ఒక తల్లి భయం భయంగా వారికేసి చూస్తోంది.

"మల్లవ్వ ఇల్లు ఇదేనా అవ్వా !" సాధ్యమయినంత మృదువుగా అడిగాడు జాప లక్ష్మారెడ్డి తాత.

"మల్లవ్వ ఏం గావాలె నీకు"

"బిడ్డ"

రాసుకోవడానికి తల వంచారు బి.ఎస్. రాములు, మల్లిఖార్జున్. తత్తరపడి పోయింది తల్లి. కొంచెం వెనక్కి జరిగారు అందరూ..

"ఎందరు పిల్లలు మీకు"

"ఇద్దరు కొడుకులు, ఒక బిడ్డ"

"వీటన్నింటితో మీకేం పని. మళ్ళీ ఏం చేస్తరు" అన్నట్టు భయం భయంగా చూస్తోంది. ఇది గమనించినట్టున్నారు.

“మేం మీ మేలు కోరే వాళ్ళమమ్మా! మీ ఊరి చంద్రయ్య వచ్చి మీ ఊర్లె గిట్ల జరిగిందని చెప్పిండు. అది మరింత వివరంగా మీ అందర్ని కల్సి తెలుసు కుందామని వాస్తవంగా ఏం జరిగిందో చూద్దామని వచ్చినమమ్మా” అని సముదాయించాడు పల్లె రాజేశం.

ఆమె అనుమానంగా చూస్తోంది. నిరుడు ఇలాగే ఎవరో వచ్చారన్న విషయం గుర్తుకు వచ్చినట్టుంది. మనసు కొంచెం స్థిమితపడ్డట్టుంది. గడపదాటి రెండు అడుగులేసింది. “ఊఁ” అంది.

తమ మీద విశ్వాసం అపుడపుడే కుదురుతున్నట్టుగా గమనించి కొంత ఉత్సాహం పుంజుకున్నాడు పల్లె రాజేశం.

“ఆ రోజు మొట్టమొదట మీ ఇంట్లకు ఎంత మంది వచ్చిన్రు.....”

“ఇద్దరు”

“ఏం అడిగిన్రు”

“అదెక్కడున్నది ? అనుకుంట ఇల్లంత యెతికిన్రు.”

“దొరికిందా ?”

“లే (దు)”

“మరెక్కడ దొరికింది ?”

ఆ తల్లి మెల్లిగా పదడుగులు ముందుకు నడిచింది. మల్లవ్వ తండ్రి కూడా వెనక నడిచాడు. వాళ్ళు అనుసరించారు. ఆ కనిపిస్తున్న గుట్టవేపు చూపిస్తూ అంది.

“అగో ఆ మొండి ఇప్పచెట్టు కాడ దొరికిచ్చుకున్నరు. అది ఉరుకంగ కాలు పట్టుకున్నరు. అందరు దాని యెంబడిబడ్డరు. ఇద్దరేమో ఇంట్ల జొచ్చిన్రు.”

ఆ మాటలు వింటూ మెల్లిమెల్లిగా అన్ని ఇళ్ళ తలుపులు తెరుచుకుని వాళ్ళకేసి చూస్తున్నాయి. ఏమిటో తెలుసుకురమ్మన్నట్టున్నారు. ఇద్దరు ముగ్గురు దూరం నుండి వీళ్ళని చూస్తున్నారు.

మల్లమ్మ తల్లి మళ్ళీ ఇంట్లోకి నడిచింది. బృందం కూడా ఈసారి ఇంటిలోపలికి నడిచారు. అలా మంచం మీద కూర్చున్నారు మల్లిఖార్జున్, తాడిగిరి పోతరాజు. మిగిలినవాళ్ళు ఒకసారి ఇళ్ళంతా పరికించారు.

"అట్ల కూసో అవ్వా! తొందరేం లేదు. వివరంగ జెప్పు."

మల్లవ్వ తండ్రి, తల్లి వాళ్ళ ఎదురుగా కూర్చుండిపోయారు. మంచంలో స్థలం చాలని వాళ్ళు కింద కూర్చుండిపోయారు. వేణుశ్రీకి కూర్చున్నా నిలబడినా తడిసిపోయిన డ్రెస్సుతో చలిగా వున్నట్టుంది. తలుపుని ఆనుకుని అలా నిలబడిపోయాడు.

మనసు చిక్కబట్టుకుంటూ ఒక్కొక్కటిగా పూసగుచ్చినట్టుగా చెపుతోంది తల్లి.

ఆ సందిలో యిళ్ళవాళ్ళు ఒక్కొక్కళ్ళు అక్కడకు చేరి నిలబడి చూస్తున్నారు. కొద్దిసేపటికి అది చిన్న మీటింగులా అయిపోయింది.

"అయితే మీ ఇంట్ల నిజంగానే బాంబులు దొరికినయా ?" అడిగాడు పల్లె రాజేశం.

అందరు ఆసక్తిగా వింటున్నారు. నిశ్శబ్దంగా వుంది. రాసుకోవడానికి అందరు గుమిగూడడంతో చీకటిగా వుంది. వేణుశ్రీకి సైగ చేశాడు తాడిగిరి పోతరాజు.

మల్లవ్వ తల్లి మౌనంగా వుండిపోయింది.

"చెప్పు..... ఉన్న నిజం అవ్వా !"

"బాంబులు దొరకలే గని కొన్ని సీటీలు దొరికినయ్" సంకోచిస్తూ సంకోచిస్తూ అవ్వ చెప్పడంతో అందరి ముహాలు ప్రశ్నార్థకా లయ్యాయి.

"ఏం సీటీలు (చిట్టీలు) ?"

మెల్లిగా లేచింది అవ్వ... మొగురం గుంజపైకి చేయి చాపి ఏదో వెతికింది. అది పొగ దుమ్ము పేరుకుపోయి కొంత ఎలుకలు కొట్టినట్టయింది. వారి చేతుల్లో పెట్టింది. అది ఏదో కరపత్రంలా వుంది.

"ఇవి పంచంగ కొన్ని మిగిలితే ఆ గూట్లె పెట్టింది" గూడు చూపించింది.

"ఈ కరపత్రాలు అచ్చేసుడు, పంచుడు, వుంచుకొనుడు.... మన జన్మహక్కు" మల్లిఖార్జున్ దాన్ని చూస్తూ అన్నాడు.

"అయితే ఇంకేం అడిగిన్రు..."

"అడుగుడెక్కడ సారూ... కొట్టుకుంట తన్నుకుంట గుద్దుకుంట అందరి

తీర్గయింట్ల బడిసావక... సంగం అని పెద్దతనం ఎత్తుకుంటావే... ఎవడే నీ మిండడు?... అనుకుంట..."

ఏవో పచ్చిపుండు వంటి జ్ఞాపకాల్ని మళ్ళీ కెలికినట్టయి ఆ తల్లి గొంతు జీరబోయింది. మాట పెగలలేదు. కొంగులో ముఖం దాచుకుంది తల్లి... తండ్రి నిశ్శబ్దంగా కన్నీరు పెడుతున్నాడు. తల్లి కన్నీరు పెడుతూ వెక్కివెక్కి ఏడుస్తోంది.

"నా బిడ్డో... నా బిడ్డా... నిన్ను ఎంత జేసిన్రే... నా బిడ్డా..." అంటూ హృదయ విదారకంగా ఏడుస్తోంది.

వాతావరణం గంభీరమైపోయింది. ఏడ్చి ఏడ్చి కొంతసేపటికి తానే కళ్ళు తుడుచుకుంది.

"వాళ్ళను గుర్తుపట్టగలవా అవ్వా !"

"ఎందర్నని గుర్తుపట్టాలె కొడుకా... పదమూడు మంది... పసిపోరి మీదపడి చేతిల పిస్తోలున్నోడు ముందుగాల..." మళ్ళీ ఏడుస్తూంది తల్లి.

"మీరు అడ్డంబడి బతిమాలలేదా?"

"మమ్ముల మొగురాలకు కట్టేసిన్రు సారు.. ఏడ్చుకుంట మొత్తుకుంట మేముంటె మా నోట్లె బట్టగుచ్చిన్రు.. మా కండ్ల ముంగటనే వాల్లు.. అది విలవిల.. మీరు కూసున్న కాన్నె సారూ.." ఇక చెప్పలేక, నిలబడ్డదల్లా శక్తి చాలక కూలబడిపోయింది ఆ తల్లి.

ఎందుకో ఒక్కసారి వులిక్కిపడి మంచంవైపు, మంచం కింద చూశారు. వాళ్ళ మనసంతా ఎలాగో అయిపోయింది. ఆ ఆర్తనాదాలు చెవుల్లో గింగురమని విన్పిస్తున్నట్టుగా తాడిగిరి పోతరాజు ముఖం కోపంతో ఎర్రబడింది.

వాళ్ళిద్దరిని కొంతసేపు ఓదార్చి సెలవు తీసుకుని బయటకు నడిచారు. రాజేశ్వరి ఇంటివైపు దారి తీశారు. ఆడవాళ్ళు వారివెంట నడిచారు.

❄ ❄ ❄

మబ్బుకమ్మి వుండటం వల్ల వెలుగు వెన్నెలలా వుంది. వీధులు వర్షపు నీటి కాల్వలుగా ఇంకా డ్యూటీ చేస్తూనే వున్నట్టున్నాయి.

కలువదగిన వాళ్ళందరినీ కలుసుకునేసరికి అనుకున్న సమయంకన్నా చాలా ఆలస్యమైపోయింది. జీపువద్దకు చేరేసరికి వాళ్ళకోసమే పది పన్నెండుమంది యువకులు ఎదిరిచూస్తున్నట్టున్నారు. డ్రైవరుతో ఏదో మాట్లాడుతున్నారు. వీళ్ళు కన్పడ్డంతోనే "నమస్తే సార్" అంటూ అందర్నీ పలకరించి నిలబడ్డారు.

"ఊర్లె జూడవోతె ఎవరూ లేరు - అందరూ ఇక్కడ జమైన్రు..." పరామర్శించాడు పల్లె రాజేశం.

"మీ జీపు మహత్యం సారు" అంటూ నవ్వారు.

పల్లె రాజేశం అర్థం కాక నొసలు ముడిచాడు.

"జీపు రేజ్ చేసిన చప్పుడు వినవడ్డది. మా పల్లెల్లకు ఎవల జీపులత్తయి సారు? పోలీసుల జీపు అనుకొని... ఊర్లెకెల్లి ఇగ వురికినం..." అందరి తరుపున మాట్లాడాడు ఒక యువకుడు.

"ఒక్క ఇల్లన్న తలుపుతీసి లేదయ్యా! మమ్ముల జూడంగనే... తలుపులేసుకున్నరు" చలితో దవడలు కొట్టుకుంటూ అడిగాడు వేణుశ్రీ.

"మా ఊల్లెకు మరి కొత్తోల్లు ఎవలత్తరు సారు?.. పోలీసోల్లు తప్ప"

ఆ గొంతు గుర్తు. ఎప్పుడో విన్నట్టుంది. ఎక్కడో! గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నం చేస్తూ అడిగాడు తాత.

"నీ పేరూ?"

"రాజన్న. రాయేశ్వరి పెనిమిటిని తాతా!" బక్కపలచని మొహం - నిర్మల మైన గొంతు - గుర్తుచేశాడు రాజన్న.

" ఓర్నీ! నేను గూడ నిన్ను గుర్తుపట్టలేదు సూడూ... నువ్వేగాదూ... ఆరోజు చంద్రయ్యతోటి వచ్చింది..." పల్లె రాజేశం విస్తుపోయాడు.

"ఔ..! పెద్ద పెద్దోల్లకు గీ బుడ్డగోచీలోల్లం ఎట్ల గుర్తుంటం సారు?"

పల్లె రాజేశంకు తన వీపు మీద ఎవరో చరిచినట్టయింది. జ్ఞాపకశక్తి సరిగ్గా లేనందుకు తనను తాను తిట్టుకున్నాడు.

"అవునూ! రాజన్నా! రాజేశ్వరిని తల్లిగారింటికి పంపినవట.." అర్థోక్తిగా అడిగాడు లక్ష్మారెడ్డి తాత.

తాత ఏం అడుగుతున్నాడో ఎందుకు అడుగుతున్నాడో రాజన్నకి అర్థమవుతూనే వుంది.

“ఆ లం.. కొడుకులు గట్ల జేసిన్రని యిడ్సిపెడ్తనా తాతా! దానికి నేను తప్ప ఇంటికాడ మాత్రం ఎవలున్నరు? మా మామ లేకనేపాయె. మా అత్త ఎడ్డిదేనాయె”

“మరి ?” అర్థం కాక అడిగాడు లక్ష్మారెడ్డి తాత.

“అట్ల సాతగాని పానంతో ఇక్కడుంటె వాల్లు మల్లత్తె ఎట్ల? అని మందులు వాడుకుంట ఉండుమని పంపిచ్చిన..” అన్నాడు రాజన్న.

“నువ్వే బుద్ధిమంతుడివి రాజన్నా! అందరు గిట్ల నీ తీర్గ ఆలోచించాలె...” తాత సానుభూతిగా మెచ్చుకోలుగా అన్నాడు.

వాళ్ళు తెల్సుకున్న సంగతులు చెప్పి ఇంకేమైనా ఉంటే చెప్పండి అని అడిగాడు పల్లె రాజేశం. తలా మరికొన్ని వివరాలు తెలిపారు. వాల్ల హృదయాలు భారమైపోయాయి.

జీపును మళ్ళీ నెట్టాల్సి వచ్చింది. బృందం నెట్టబోగా ఆ యువకులంతా వారించారు.

“మేం వున్నం గద సారు! అంత దూరంనుంచి ఇన్ని కష్టాలు పడుకుంట వచ్చిన్రు. గింత (ఈ కాస్త) జెయ్యకపోతే ఎట్ల?” అంటూ ఆ యువకులంతా కలిసి నెట్టారు. జీపు స్టార్టయింది.

“ధైర్యంగ ఉండున్రి. మేం కలెక్టర్ను కలిసి మాట్లాడుతం. మాట్లాడ్తె మాత్రం ఏం చేస్తడు గని. మేం వచ్చినమని తెల్సి మిమ్ముల మల్ల ఏమన్న అంటరేమో ధైర్యంగా వుండున్రి.” అన్నాడు పల్లె రాజేశం.

అలా బృందం వారికి ధైర్యవచనాలు చెప్పింది. అంతా విని గౌరవంగా తలలూపారు వాళ్ళు. రాజన్న తనలో తాను నవ్వుకున్నాడెందుకో. ఫ్రంటు సీట్లో కూర్చోబోతూ అది గమనించాడు పల్లె రాజేశం. ఎందుకో అర్థం కాక అడిగాడు.

యువకులంతా జీపుకి మూడు ప్రక్కలా నిలబడి వారిని ఆసక్తిగా, గౌరవభావంతో చూస్తున్నారు. పల్లె రాజేశం పక్కనే నిలబడ్డ రాజన్న తటపటా యించాడు.

"ఏంటిదో చెప్పరాదూ! నీతో మేమంత నవ్వుతం గద" నవ్వుతూ మళ్ళీ అడిగాడు పల్లె రాజేశం.

"ఏం లేదు సారు. మా ధైర్యానికేంది గని. మాకున్నయి రెండే. సావనన్న సావాలె. కొట్లాడనన్న కొట్లాడాలె. మా గతి గట్లున్నది. ఇగ మేం ధైర్యంగ వుండకేం జేస్తంగని. మీరే" అంటూ అరక్షణం ఆగి అందరివేపూ చూసి మళ్ళీ అన్నాడు. "నిరుడు వచ్చినోళ్ళు ఇప్పుడు ఇద్దరే అచ్చిన్రు. మరి వచ్చే ఏటికి ఎందరు మిగులుతరో. కొంచెం ధైర్యంగా వుండున్రి సారు."

ఆ మాట బృందానికి ఎక్కడో ఆయువుపట్టు మీద తగిలినట్టుంది. ఆ అఘాతం నుండి చప్పున కోలుకోలేక పోయినట్టున్నారు. అందరూ గంభీరంగా వుండిపోయారు.

జీపు కదిలింది.

"మంచిది"

పరస్పరం గౌరవసూచకంగా చేతులు కలిపారు.

❄ ❄ ❄

పొద్దు యింకా గుంకినట్టులేదు. కంకర రోడ్డు మీద వర్షం నీళ్ళు పల్లం లోకి ప్రవహించినట్టున్నాయి. రోడ్డు తేమగా పెరిగిన పచ్చగడ్డితో పచ్చగా వుంది. జీపుటైర్ల అచ్చులు మినహా మిగతా రోడ్డు వాడకంలో లేకపోవడం వల్లో ఏమో అక్కడక్కడ పరికిరేగు కంపచెట్లు, ఈత చెట్లు పెరుగుతున్నాయి. అది వదిలేసిన రోడ్డులా వుంది కాని ఆ వూరికున్న రోడ్డు అదొక్కటే.

పల్లె రాజేశం ఆలోచిస్తున్నాడు. రాజన్న అన్న మాటలే చెవుల్లో గింగుర్లు తిరుగుతున్నట్టున్నాయి. "ఎంత పెద్ద మాట అన్నాడూ?"

నిజమే! ఆ మాటలో తప్పేముంది ? నిరుడు వచ్చిన శ్రీహరి తప్పుకున్నాడు. మల్లేశం లెక్చరర్ మరీ మొండిగా బండగా ఇందులో పనిచేస్తున్నాడని - ఇక లాభంలేదని యింకో జిల్లాకి ట్రాన్స్ఫర్ చేయించారు. ఆ హరిజన లీడరు ఈ సారి అయినా రావయ్యా - ఆ రేప్ చేయబడిన అమ్మాయిల్లో మీ హరిజన అమ్మాయికూడా వున్నదటయ్యా అంటే.. ప్రతిసారీ చెపుతున్నట్టే యిప్పుడూ

తప్పించుకున్నాడు. ఆయనకి ఆ రావుగారింట్లో సత్యనారాయణ వ్రతం – అక్కడికి వచ్చేవాళ్ళందరిని కలవడం ముఖ్యమైపోయింది.

తప్పుకోవాలంటే తనకూ బోలెడు కారణాలున్నాయి. తాను ఈపని చేస్తున్నందుకు ఇంటి వద్ద కుటుంబాన్ని తిప్పల పాలు చేస్తున్నారు. మల్లిఖార్జున్‌కు, పాపారావుకు ఇందులో తిరుగుతున్నందుకు మేజిస్ట్రేటు వుద్యోగం రాకుండా పోయింది. మరో పదిహేను మందిని వారం పదిరోజులు 'అత్తవారింట్లో' (జైలులో) వుంచుకుని మర్యాదలు చేసి పంపారు.

తనకు యింట్లో ఎంతో పని వుంది. బెడ్ పేషంట్ తమ్ముడిని టెస్టింగ్ కోసం తీసుకెళ్ళాలని ఎన్నో రోజులుగా వాయిదా వేస్తున్నాడు. ఎప్పుడూ ఏదో ఒక పని. అది వాయిదా పడుతునే వుంది. అలా అదీ యిదీ వదులుకుని యిటు వస్తే.. ఇక్కడ వీళ్ళు తనకే చురకలు వేస్తారు.. వేస్తారు – వెయ్యకేం చేస్తారు..? నడవని ఎద్దు నడవకనేపాయె.. యిక నడిచే ఎద్దునేకదా.. పొడిచేది...! అందులో వాళ్ళననేదేమున్నది..? నిజంగానే కొందరు తప్పుకుంటున్నారు కదా..!.

ఎవరూ మాట్లాడ్డంలేదు. జీపు గంభీరంగా పోతోంది. ఆ మౌనం అందరికీ దుస్సహంగా వున్నట్టుంది. మల్లిఖార్జున్ ఆ మౌనాన్ని బద్దలుకొడుతూ అన్నాడు.

"రాజన్న. ఎంత పెద్ద మాటన్నడో సూడు.."

పల్లె రాజేశం నవ్వుకున్నాడు. తాడిగిరి పోతరాజుకు, జాప లక్ష్మారెడ్డి తాతకు అలాంటివి అలవాటయి పోయినట్టున్నాయి. వాళ్ళు తమను కాదులే అన్నట్టు వూరుకుండిపోయాడు.

'ఈ రోజు ఫిల్మ్ సొసైటీ సిన్మా.. చాలా మంచి సిన్మా తెచ్చారు.. ఎన్నో రోజులుగా చూద్దామనుకున్న సిన్మా అది.. అంత మంచి ఛాన్సు విడిచిపెట్టుకుని వస్తే రాజన్న అట్లా అంటాడేమిటి?.. అని ఆలోచిస్తున్నాడు వేణుశ్రీ.

"అవును అందులో తప్పేముంది?" వెనక్కి తిరిగి చూస్తూ మళ్ళీ అన్నాడు లక్ష్మారెడ్డి తాత. "ఆఁ హరిజన లీడరట.. నీ కులపోల్ల సమస్య కూడానయ్యా అంటే... ఏం జేసిండో చూడు.. ఇక అనుమంటే అనరా మరి..?"

ఆ హరిజన లీడర్ని – కేవలం ఆ కులంలో పుట్టినందుకు అందరి పేరిటా వచ్చే సౌకర్యాల్ని రిజర్వేషనని తానొక్కడు అనుభవించడం పట్ల జనతా లీడరు

ఆంజనేయులుకు అసహ్యంగా వున్నట్టుంది. "కనీసం తన కులస్థులు అన్న అభిమానమైనా లేనివాడు.. మళ్ళీ ఆ కులస్థుల పేరిటే నాయకుడు.." వెటకారంగా అన్నాడు ఆంజనేయులు.

"ఆయన అధికార పార్టీ ఎం.పి. సీటు టికెట్ కోసం ఇప్పటినుంచే పైరవీ మొదలుపెట్టిండు. ఇగ మనతోఏం పని..? మనతోటి తిరిగితే టికట్ గాదు, పార్టీలో మంచినీల్లు గూడ పుట్టనియ్యరని తెలువదా..?"

జీపు 'టి' జంక్షన్ రోడ్డు చేరువలోకి వచ్చింది. డ్రైవరు పల్లె రాజేశంకేసి సాభిప్రాయంగా చూశాడు.

"రైటుకు" అన్నాడు పల్లె రాజేశం.

"ఆ పల్లె చేరేసరికి చీకటి పడేట్టున్నది గదా..! మల్ల రాంగ ఇదే తొవ్వల రావాలె. రాత్రి బండి అప్పటోలె దిగవడ్తే చీకట్ల తిప్పలైతది.. లెప్టుకు పోనియ్యరాదూ" చలిచలిగా వణుకుతూ అన్నాడు వేణుశ్రీ. అతడి డ్రెస్సు ఇంకా ఆరినట్టు లేదు. ప్రశ్నార్థకంగా చూశాడు. పల్లె రాజేశం వారించాడు.

"అక్కడ వాళ్ళు మనకోసం ఎదురు చూస్తరు. నిన్న అక్కడ్నించి మనిషి వచ్చిండు. మీ కోసం ఎదిరిచూస్తున్నరు సారు' అని చెప్పిండు.. పోకపోతె ఎట్లుంటది.. ?" అంటూ డ్రైవరు కేసి చూశాడు పల్లె రాజేశం.

జీపు రైటుకు తిరిగింది. మరో పల్లెకు చేరడానికి వేగం అందుకుంది. రోడ్డు సరిగ్గా కనిపించక హెడ్ లైట్లు వేశాడు డ్రైవరు.

రోడ్డు పక్కనున్న కోపుల్లో (కూపీ) నిండ నీళ్ళలో నుండి కప్పలు 'బ్రాం క్-బాంకీ-బ్రెక్-బేక్....' అని అరుస్తున్నాయి. ఏదో నక్కలా వుంది. లైట్ల వెలుగుకి రోడ్డు మీంచి చెంగున దూకి చీకట్లో కలిసిపోయింది. ఏదో వానపాము రోడ్డుమీద పాకుతోంది. ఆ వెలుతురు కళ్ళ మీద పడటంతో ఎటుపోవాలో తోచనట్టుంది. జీపు కింద పచ్చడి పచ్చడి అయిపోయింది. అలా జీపు వేగంగా దూసుకుపోతూనే వుంది.

❄ ❄ ❄

మరో పల్లెలో కూడా పని ముగించుకుని వాపసు బయల్దేరడానికి తయారయింది నిజనిర్ధారణ కమిటీ! అంతలో కర్రలతో పది పదిహేనుమంది

గూండాలు చుట్టుముట్టారు. వాదోపవాదాలు జరిగాయి. వెంట్రుకవాసిలో తలలు పగిలే ప్రమాదం నుండి బయటపడ్డారు. డ్రైవరు జీపు స్టార్టులో వుంచడం, ఆపినట్టే ఆపి స్పీడుగా రేజ్ చేసి చాకచక్యం చూపడం వల్ల బతికిపోయారు.

ఊరు దాటిందో లేదో రాజన్న సైకిల్‌పై ఎగపోస్తూ వస్తున్నాడు. ఆ పల్లె నుంచి ఈ పల్లెకి సైకిల్‌పై ఆ బురద రోడ్డు మీద రావడంతో చెమటలు కక్కుతున్నాడు. చెయ్యి వూపుతూ జీపును ఆపాడు. ఎగపోస్తూనే చెప్పాడు.

"టీ రోడ్ జంక్షన్ కాడ పోలీసులు జీపుల వచ్చి మీ కోసం ఎదిరిచూస్తున్నరు సారు. మీరు కనవడ్తే ఈ రాత్రికి మిమ్ముల యిడ్సి పెట్టరు".

వేణుశ్రీ ఒక్కసారిగా అదిరిపోయాడు. పల్లె రాజేశం నొసలు ముడిచాడు. తాడిగిరి పోతరాజు, ఆంజనేయులకు ఆవేశంగా వున్నట్టుంది.

"వాల్లెవరండీ మనని ఆపడానికి పద" అన్నారు.

జాప లక్ష్మారెడ్డి తాత వారించాడు.

"పోలీసులతో వాదన పెట్టుకోవడం ప్రస్తుతం మన పని కాదు.. రేపు రిపోర్టు రాసి పట్టుకుపోయి ఎస్పి ఆఫీసులోనే వాదన పెట్టుకుందాం.. ఇప్పుడు ఈ రాత్రి వాదన వద్దు. వాళ్ళ చేతుల్లో అధికారం, అహంకారం ఉంది.. మనం వచ్చినపని జరిగేట్టు చూసుకోవాలి.."

"మరి యిక్కడినుంచి వేరే రూటుందా ?" రాజన్నను అడిగాడు పల్లె రాజేశం. ఉందన్నట్లు తల వూపాడు రాజన్న.

"కొంచెం ముందుకు పోయినంక కుడి పక్కకు బండ్ల బాట వుంటది. బాట మంచిగ లేదు గని కొంచెం కష్టపడాలె... బాట నడుమల పొలాల నీల్లు పారే 'అందూరు' (ఎప్పుడూ నీళ్ళు పారే భూమి) వుంది. అండ్ల కొంచెం జీపు సూసుకుంట నడిపిస్తిరంటే అవుతల కొంచెం దూరం పోయినంక కంకర రోడ్డు అందుతది.. కొంచెం చుట్టుతవ్వగని ఇదే తొవ్వ మంచిది.."

"మంచిది" అన్నాడు పల్లె రాజేశం.

"జాగ్రత్త మనమడా! మా కోసమని నువ్వు మల్ల యిరుకుల పడేవు.." హెచ్చరించాడు జాప లక్ష్మారెడ్డి తాత.

వచ్చిన పనైతే జరిగిందన్న సంతోషంతో తలూపాడు రాజన్న.

రాజన్న సూచించిన బాట వెంట జీపు మెల్లమెల్లగా వెళ్తోంది.

❄ ❄ ❄

అలా అన్ని అవాంతరాలు అధిగమించి తార్రోడ్డుపై వేగంగా పరిగెడుతోంది జీపు. వాళ్ళు చేరాల్సిన దూరం యింకా అయిదారు కిలోమీటర్లే వున్నట్టుంది. అప్పటికిగాని వేణుశ్రీ గుండె దడ తగ్గి ఆ షాక్ నుండి తేరుకోలేకపోయాడు. ఉదయం నుంచి భోంచేయని కడుపులు ఆకలి అని అరవటం మానేసినట్టున్నాయి. ముందు యిల్లు చేరడం ఎలా అన్న ఆలోచనలో ఆకలి మర్చిపోయారు.

"ఊళ్ళోకి చేరగానే డబుల్ స్ట్రాంగ్ ఫుల్ ఛాయ్ కొట్టాలె – ఆ మూల మీద హోటల్ వద్ద ఆపుకోవాలె డ్రైవరుసాబూ" తాడిగిరి పోతరాజు ముందే ప్రతిపాదించాడు. అందర్తో పాటు డ్రైవరుకు కూడా ఆ సలహా బాగా నచ్చినట్టుంది. అలసిపోయిన అందరి మొహాల్లో చిరునవ్వు వెలసింది.

"మంచిది సార్" హుషారుగా ఉతారు (డౌన్) రోడ్డు మీద మరింత స్పీడు అందుకుంది జీపు. అకస్మాత్తుగా ఇంజన్ శబ్దం ఆగిపోయింది. కాని జీపు పోతూనే వుంది. చడావ్ (అప్) కావడంతో అక్కడే ఆగిపోయింది.

"దగ్గరికి వచ్చినంక ఏమైంది?"

"పెట్రోల్ అయిపోయినట్టుంది సార్" అంటూ డ్రైవర్ బ్యానటు ఎత్తాడు. రిజర్వులో మిగిలిపోయిన పెట్రోల్‌ను నోటితో పీల్చి సీసాలోకి పట్టాడు అది ఎంత దూరందాకా వస్తుందో అంచనా వేస్తూ అన్నాడు డ్రైవర్.

"ఇది ఆ మూల హోటల్ దాక సరిపోతది సార్.."

"అరె! ఎట్ల ? ఆ పెట్రోల్ పంపుదాకా చేరదా ?"

"చెప్పలేను సార్.."

" మల్ల వర్షం పడేట్టున్నది.. అందర్ని ఎవలింటికాడ నాళ్ళని దించాలె.. ఒక లీటరన్న రెండు లీటర్లన్న పోపియ్యాలె.. పెట్రోల్ పంపుదాకా పోయెటట్లు జూడరాదు.." తమలో ఒకడుగా కలిసిపోయిన డ్రైవర్ని అడిగాడు పల్లె రాజేశం.

"ఒక కిలోమీటరు ఎట్లనన్న జేసి నూకవలసి వస్తది సార్.."

"అందరు జూడంగ ఊర్లె నూకుతె పరువుపోతది.. ఇక్కడ్నించె నెట్టుదాం మరి" అంటూ అందరూ దిగారు. కిలోమీటరు దూరందాకా నెట్టాక జీపు స్టార్టవడం, వర్షం పడడం ఒకేసారి జరిగాయి.

"ఆ హోటల్ కాడ ఆపితె మల్ల పెట్రోలు అందుకుంటదో లేదో సక్కగ పెట్రోల్ పంపుకు పోనియ్యి..." అంటూ తాడిగిరి పోతరాజు తన ప్రతిపాదన రద్దు చేశాడు.

పెట్రోల్ పోయించుకుని ఎవరిళ్ళ సమీపంలో వాళ్ళని దింపి జీపు టాక్సీ స్టాండు వేపు సాగి పోయింది.

విసిరికొడుతున్న వర్షంలో ఎవరిళ్ళకు వాళ్ళు చేనే సరికి వర్షం నిలిచి కురుస్తోంది.

అలా ఆ రోజుకి ప్రయాణం ముగిసింది.

**అరుణతార మాస పత్రిక - సెప్టెంబర్ 1986**

1978 నుండి తెలంగాణ ఉద్యమంలో ప్రభుత్వం, దొరలు, భూస్వాములు సాగిస్తున్న అణచివేత, దౌర్జన్యాలను వెలికి తీస్తూ పౌరహక్కుల ఉద్యమకారులు తాము కూడా అనేక నిర్బంధాలకు గురవుతున్నారు. జాప లక్ష్మారెడ్డి, డాక్టర్ రామనాథం, లాయరు పురుషోత్తం రెడ్డి, జర్నలిస్టు రసూల్ తదితరులెందరో పౌరహక్కుల ఉద్యమంలో పని చేస్తున్నందుకు కసిగా హత్య చేయబడ్డారు. గత ముప్పయ్యేళ్ళుగా ప్రజలపై, ప్రజాస్వామిక వాదులపై సాగుతున్న అణచివేత, దౌర్జన్యాలను, తెలంగాణ స్థితిగతులను పూర్తిగా అద్దం పట్టే కథ. ఈ కథలో ఎన్ని వుండాలో అన్నీ వున్నాయి. తెలంగాణలో ఏదో ఒక ఉద్యమం చేయని పల్లె లేదంటే అతిశయోక్తి కాదు.

తెలంగాణ జిల్లాల్లో పౌర హక్కుల సంఘం (ఏపిసిఎల్‌సి) వెళ్లని వూరంటే లేదనేది కూడా వాస్తవమే. ప్రతిరోజు ఏదో ఒక మూల సంఘటనలు జరగటం వెంటనే అక్కడికి హక్కుల సంఘాల వారు వెళ్ళటం రిపోర్టు తెచ్చి పత్రికల్లో ఇవ్వటం అనేదే పొరపాటు అని పోలీసులు, ప్రభుత్వం భావించడం ద్వారా ప్రజాస్వామిక హక్కులను కాలరాయడానికి పూనుకున్నారు.

ఈ కథలో అత్యాచారం చేయబడిన పోచవ్వ, రాయేశ్వరీలు దళిత బిడ్డలు. ఎక్కువ ఈ దారుణాలకు గురయ్యేది మాత్రం దళితులే అనేది రచయిత సుస్పష్టంగా కథ ద్వారా తెలియజేశారు. అయితే ఈ కథ రాసేనాటికి రచయిత వర్గ దృక్పథానికి

ప్రాధాన్యతనిచ్చారు. ఉద్యమాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలు అన్యాయాలకు, అక్రమాలకు గురవడంలో పేదరికం, కులం పాత్ర కూడా వుందని భావించినప్పటికీ అది ఆనాటి కథల్లో చిత్రించినట్టు కనపడదు.

ఊరు చివరన వాగు పోయే నీళ్ళ పక్కన ఇండ్లు కట్టుకొని వున్న పల్లెలు తెలంగాణలో బోలెడు వున్నాయి. కిడ్నాపులు అనేవి రౌడీలు గూండాలే కాదు పోలీసులు కూడా చేస్తారని చంద్రయ్య పాత్ర ద్వారా తెలుస్తుంది. హక్కుల సంఘం వాళ్ళు విచారణకు వెళ్ళినప్పుడు దాడులు చేయటం కూడా మామూలు విషయం. అలాగే కొన్ని చోట్ల హత్యలకు కూడా పాల్పడ్డ వారు కోకొల్లలుగా కనపడతారు. అందుకే వారు రిపోర్టు తీసుకొని తిరిగి వస్తుంటే కొంతమంది మాటు గాశారని తెలుస్తుంది. అంటే రిపోర్టు కోసం వచ్చిన వారిని వదిలిపెట్ట కూడదని అటు పోలీసులు, మరొకవైపు భూస్వామ్య గూండాలు అనేకసార్లు దాడులు జరిపారు. బీహార్‌లోను, పశ్చిమ బెంగాల్‌లోను, ఉత్తర ప్రదేశ్‌లోను, మధ్యప్రదేశ్, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, మహరాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల్లో ఇదే క్రమం నేటికీ సాగుతున్నది. ఒరిస్సాలో పౌరహక్కుల కోసం పని చేసే అడ్వకేట్‌ను అరెస్టు చేసి అక్రమంగా ఆరు నెలలు జైల్లో పెట్టారు. బి.ఎస్.రాములు పౌరహక్కుల సంఘంలో సీరియస్‌గా పని చేస్తున్నందుకే 1984లో అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టి జైలు పాల్జేసి ఉద్యోగంలోంచి సస్పెండ్ చేశారు. ఇటీవల అరుధంతీ రాయ్‌ని కేంద్ర ప్రభుత్వం అరెస్టు చేయడం ఇంకా ఇదే క్రమం రెండున్నర దశాబ్దాలుగా కొనసాగుతోందనడానికి నిదర్శనం.

ఈ కథ చదువుతున్నంత సేపు తెలంగాణలో పౌర హక్కుల, మానవ హక్కుల ఉద్యమ నాయకులు కళ్ళల్లో కన్పిస్తారు. నిజంగానే ఆ సంఘానికి డబ్బులు వుండవు. డొక్కు జీపులు తీసుకొని పోవటం పరిపాటి. తెలంగాణ చిత్రపటంలో ఒక మచ్చుతునకగా ఈ కథ నిలిచిపోతుంది. రచయిత పరిశీలనా దృష్టి స్వీయ అనుభవం లేకుండా ఇలాంటి కథలు రాయడం సాధ్యం కాదు.

– నందిగామ నిర్మలకుమారి

('బి.ఎస్. రాములు కథలు – సామాజిక పరిణామాలు' ఎం.ఫిల్ నుండి)